క్లుప్తంగా

చలివేంద్రాలు ఏర్పాటు



కూడలిలో చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్, అధికారులు

చాపాడు : గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలి, మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని గ్రామ సర్పంచ్ మహబూబ్ బీ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణిలు ప్రారంభించారు. వేసవి కాలం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి సన్మానం

ప్రొద్దుటూరు క్రైం : బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం సాయంత్రం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జి.శ్రీదేవిని ఘనంగా సత్కరించింది. ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఇటీవల ఏర్పాటు కావడంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ రామచంద్రారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసన్‌రెడ్డి, జనరల్ సెక్రటరి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ రాజేష్‌రెడ్డి, కోశాధికారి ఎస్.అంజాద్‌బాషా, మహిళా సెక్రటరీ అంకాలమ్మ, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. కొత్త బార్ అసోసియేషన్ కార్యవర్గానికి జిల్లా జడ్జి శుభాకాంక్షలు తెలిపారు.

నాగయ్య సేవలు మరువలేనివి



నాగయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాజుపాళెం : పాలెం నాగయ్య సేవలు మరువలేనివని ఎంఈఓ రామస్వామిరెడ్డి, హెచ్‌ఎం హాజీ రహమతుల్లా పేర్కొన్నారు. మండలంలోని వెలవలి గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయోలాజికల్ సైన్సు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన నాగయ్య దంపతులను నాగయ్య కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ జాకీర్‌హుసేన్, భాస్కర్, కృష్ణయ్య, నరసింహమూర్తి, రషీద్ ఖాన్, స్నేహితులు, గ్రామస్తులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

బాధ్యతలు చేపట్టిన అర్బన్ సీఐ



అర్బన్ సీఐ శ్రీహరి

మైదుకూరు : స్థానిక అర్బన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన శ్రీహరి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సయ్యద్ హాసం ఏసీబీ విభాగానికి బదిలీ కావడంతో, కర్నూలు వీఆర్‌లో ఉన్న శ్రీహరిని అర్బన్ సీఐగా ప్రభుత్వం నియమించింది.

ఘనంగా పదవీ విరమణ



భూమిరెడ్డి రామసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న తెలుగుగంగ అధికారులు

బ్రహ్మంగారిమఠం : తెలుగుగంగ ప్రాజెక్టు సబ్ డివిజన్-4 బ్రహ్మంగారిమఠంలో వర్క్ ఇన్‌స్పెక్టర్, గ్రేడ్ 2 పనిచేస్తూ బుధవారం పదవీ విరమణ పొందిన భూమిరెడ్డి రామసుబ్బారెడ్డిని సిబ్బంది, కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈఈ పిండి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పదన్నారు. ప్రతి ఉద్యోగి వారికి అప్పచెప్పిన పనులు తప్పకుండా చేసినప్పుడు మంచిపేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ మురళీమోహన్‌కుమార్, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న విశ్వనాథరెడ్డి

పోరుమామిళ్ల : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దారు యనమల ప్రభాకర్‌నాయుడు సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డి, మండల కో-ఆప్షన్ మెంబర్ అల్లా, ఉప సర్పంచ్ రాళ్లపల్లె రవి, మాజీ సర్పంచ్ భూతప్ప సందర్శించి, పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మద్యం బాబుకు జైలు శిక్ష

కడప అర్బన్ : మద్యం తాగి ఆటో నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి 17 రోజుల జైలుశిక్ష విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ కోర్టు జడ్జి తీర్పుచెప్పారు. ఒక్కి రవి కుమార్ గత నెల 29న మద్యం తాగి ఆటో నడుపుతూ తనిఖీ చేయగా పట్టుబడ్డాడు.. సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో మేజిస్ట్రేట్ మంగళ గౌరీ శిక్ష విధించినట్లు సీఐ జావిద్ తెలిపారు.

నిలువునా ముంచిన నిర్మల్ రకం!

- దోస రైతుకు శాపంగా మారిన వాతావరణ మార్పు
- సాగుకు రూ.లక్ష వరకు పెట్టుబడి
- చేతికందే సమయంలో పగులుతున్న కాయ
- గిట్టుబాటులేక నష్టాల్లో ఊబిలో రైతన్న



మండలంలో రైతులు సాగు చేసిన దోస పంట



మార్కెట్ వసతి లేక తోటలోనే కుప్పలుగా వదిలేసిన దోసకాయలు

అట్లూరు : ఆరుగాలం కష్టపడి పది మందికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు ఎటు చూసినా కష్టాలు తప్ప లాభాలు మిగల్చడంలేదు. చీడ పీడలు ఒక పక్క అతివృష్టి.. అనావృష్టిలతో పాటు వాతావరణ మార్పులతో రైతన్న అతలాకుతలం అవుతున్నాడు. సాంప్రదాయ పంటలతో నష్టాలపాలవుతున్న రైతన్నలు స్వల్పకాలిక పంటలైన తీగజాతి దోస (నిర్మల్)రకం సాగు వైపు అడుగులేశారు. పంట ఏపుగా పెరిగింది. ఆశించిన మేర దిగుబడి కూడా వచ్చింది. అయినా కాయలు కోత దశకు వచ్చే సరికి వాతావరణంలో మార్పుల కారణంగా నిలువునా చీలిపోతున్నాయి. రైతులు ఊహించని విధంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో రైతులు కోలుకోని విధంగా కనీసం పెట్టుబడులు సైతం చేతికి అందని విధంగా నష్టాలను మిగిల్చింది.

ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి

నిర్మల్ రకం దోస సాగుకు పెట్టుబడి ఎక్కువే అయినా రైతులు వెనుకంజ వేయలేదు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 500 హెక్టార్లకు పైగా ఈ నిర్మల రకం దోస సాగు చేశారు. సేద్యం మొదలుకుని మల్చింగ్‌తో పాటు విత్తనం, క్రిమి కీటకాల నివారణకు మందుల పిచికారీ, డ్రిప్ ద్వారా ఎరువులు కూలీల ఖర్చులు మొత్తం కలిపి ఎకరాకు లక్ష రూపాయల వరకు రైతులు పెట్టుబడి పెట్టారు. అయితే ఎకరాకు 10 టన్నులు దిగుబడి వచ్చి మంచి ధర ఉంటే ఖర్చులు పోను ఎకరాకు లక్ష నుంచి రెండు లక్షలు రూపాయలు ఆదాయం వస్తుంది.

ఫ్రూట్ సెట్టింగు లోపం

పసిపిల్లలకు పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్ని జాగ్రత్తలు దోస పంట సాగులోనూ రైతులు తీసుకోవాల్సిందే. అయితే వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు పంట తట్టుకోలేక పోయింది. విత్తనం నాటిన 30 నుంచి 45 రోజుల లోపల పూతపిందె (ఫ్రూట్‌సెట్టింగు)జరగాలి. అయితే ఈ ఏడాది అలా జరగకపోవడంతో మందులు పిచికారీ, సూక్ష్మ పోషకాలు డ్రిప్ ద్వారా అధికంగా అందించాల్సి వచ్చింది. ఫలితంగా 40 నుంచి 55 రోజుల వరకు వివిధ దశల్లో పిందె సెట్టింగ్ జరిగింది. దీంతో మొదట దశలో వచ్చిన కాయలు వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు హెచ్చు తగ్గులతో కాయలు నిలువునా చీలిపోయాయి. చీలిన కాయలు చేలోనే కుళ్లిపోవడంతో ఆవేదన చెందాల్సిన పరిస్థితి రైతులకు దాపురించింది.



నిలువునా చీలిన దోసకాయలు

మార్కెటింగ్ సౌకర్యంలేక పాట్లు

అసలే పచ్చి సరుకు కోతకు వచ్చిన తరువాత రెండు రోజుల్లోనే విక్రయించుకోవాలి. లేకుంటే దోస రైతుల పరిస్థితి వర్ణణాతీతం. అనంతపురం జిల్లాలో దోస పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. అక్కడ రైతులకు బెంగళూరుతో పాటు హైదరాబాదు మార్కెట్‌లు కడపతో పోలిస్తే దగ్గరగా ఉండటంతో రైతులకు రవాణా ఖర్చు చాలా తక్కువగా ఉంటుంది. దీంతో వ్యాపారస్తులు అనంతపురం జిల్లాలో కొనుగోలు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఈ కారణంగా కడప జిల్లాలో సాగు చేసిన దోస పంటను కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు జిల్లా వైపు చూడకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు వ్యాపారస్తులు వచ్చిన టన్ను ధర రూ.12 నుంచి రూ.15 వేల మధ్యలో చెబుతుండటంతో పెట్టుబడులు రాక రైతన్నలు కుదేలవుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని వాతావరణంతో దెబ్బతింటున్న దోస పంట రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

కోలుకోలేని నష్టం



మార్కెట్‌లో మంచి ధర ఉంటుందని 15 ఎకరాల్లో నిర్మల్ రకం దోస పంట సాగు చేశాను. పైరు బాగా ఏపుగా పెరిగింది. సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చు చేశాను. వాతావరణంలో ఎండలు ఎచ్చు తగ్గుల కారణంగా పైరుకు వైరస్ సోకడంతో పాటు చేతికందిన కాయలు చీలిపోతూ దుఃఖాన్ని మిగిల్చాయి. దోస సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– అందూరు చిన్నబయపురెడ్డి దోస రైతు, దేవనగర్, అట్లూరు మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను ఐదెకరాల్లో దోస సాగు చేశాను. తీగలు బాగా సాగి కాయలు బాగా కాయడం జరిగింది. మరో వారం పది రోజుల్లో కోతకు వస్తాయనుకుంటున్న తరుణంలో కాయలు నిలువునా చీలిపోయాయి. వ్యాపారస్తులు వచ్చి కాయలు చీలిపోతున్నాయి. కోయలేం అంటున్నారు. చీలిన కాయలు కుళ్లిపోతున్నాయి. ఐదు లక్షల రూపాయలు పూర్తిగా నష్టం వచ్చింది. అన్ని రంగాల్లో ఆదుకుంటున్నట్లు ప్రభుత్వం మాలాంటి రైతులను కూడా ఆదుకోవాలి.

– రామ్మూర్తిరెడ్డి, రైతు, కుంబగిరి, అట్లూరు మండలం

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



దోస చాలా సున్నితమైన పైరు. పంట చేతికి వచ్చే వరకు చంటి బిడ్డలా కాపాడుకోవాలి. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటే ఆ ప్రభావం పంటపై పడుతుంది. అలాగే రైతులు అధిక మోతాదులో ఎరువులు, మందులు వాడడం, నీటి తడులు హెచ్చు తగ్గులు ఇవ్వడం కూడా పంటపై ప్రభావం చూపుతుంది. రైతులు ఉద్యానశాఖ అధికారుల సలహాలు, సూచనలు విత్తనం పెట్టిన మొదలుకుని పంట దశ వరకూ పాటించాలి.

– జయభరత్‌రెడ్డి, ఉద్యానవన అధికారి, బద్వేలు

రేపు విద్యుత్ అంతరాయం

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుకారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రవీంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 4 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని, మిగిలిన విద్యుత్‌ను రాత్రి 9 గంటల నుంచి సరఫరా చేస్తామని తెలిపారు. వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు మునెయ్య



మునెయ్యను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

మైదుకూరు : మైదుకూరు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ ఇంగ్లీషు ఉపాధ్యాయుడు మీసాల మునెయ్య ఆదర్శ ఉపాధ్యాయుడని ఎంఈఓలు పద్మలత, సహరిశర్మ అన్నారు. మార్చి 31న ఉద్యోగ విరమణ పొందిన మునెయ్యకు బుధవారం పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకునేందుకు ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం సంపాదించేందుకు మునెయ్య కృషి చేశారని కొనియాడారు. అనంతరం మునెయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌బాబు, రమణారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియా బాషా, సంగమేశ్వరరెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి రామమోహన్, రాష్ట్ర కౌన్సిలర్లు కె.పాలకొండయ్య, సుబ్రహ్మణ్యం, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, పోరుమామిళ్ల రీజియన్ నాయకుడు కస్తూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటాం

బి.మఠం మండల సమావేశంలో జెడ్పీ చైర్మన్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి

బ్రహ్మంగారిమఠం : బి.మఠం మండల ప్రజల సహకారంతో మండలాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటానని జెడ్పీ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సమావేశంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండల ప్రజల అభివృద్ధికోసం ఇతర పార్టీలతో కలసి ముందుకు వెళ్లేందుకు సిద్ధం అన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి వెనుక పడ్డ బి.మఠం మండలాన్ని ముదుంకు తీసుకు వెళ్లేందుకు నాయకుల సహకారం తీసుకుంటామన్నారు. మా గ్రామ పంచాయతీ పుగురాళ్ళపల్లె నుంచి ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ కావడం రాష్ట్రంలో ఇదే మొదటగా భావించాలన్నారు. మండలం నుంచి ఒక ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ ఉండటం విశేషమన్నారు. అందరం కలిసికట్టుగా మండలం అభివృద్ధికి తోడ్పడదామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ భక్తుల సౌకర్యం కోసం బస్‌షెల్టర్, రోడ్లు, తాగునీరు. డ్రైనేజి వంటివి ఎర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పార్టీలకు అతీతంగా మండల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం నివేదికలు చదివి వినిపించారు.

వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలపై ప్రతాపం

బ్రహ్మంగారిమఠం : జెడ్పీ చైర్మన్ హోదాలో ఎం.రామగోవిందరెడ్డి బుధవారం బ్రహ్మంగారిదర్శనానికి రావడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు పది ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. వాటిని చూడలేని అధికార పార్టీ నాయకులు తొలగించాలని పంచాయతీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, సిబ్బందితో కలిసి వాటిని తొలగించారు. ఎనిమిది నెలలుగా ఉన్నా టీడీపీ ఫ్లెక్సీలను తొలగించకుండా ఇప్పుడు తమ ఫ్లెక్సీలు తొలగిస్తున్నారెందుకంటూ వైస్సార్‌సీపీ నాయకులు కార్యదర్శిని ప్రశ్నించారు.దీంతో కాసేపటికి టీడీపీ ఫ్లెక్సీలు తొలగించారు. టపాసులు కూడా కాల్చకూడదని ఎస్ఐ చంద్రశేఖర్ నాయకులకు తెలిపారు.

వీరబ్రహ్మేంద్రుని సేవలో చైర్మన్

బ్రహ్మంగారిమఠం : జిల్లా పరిషత్ చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి బుధవారం బ్రహ్మంగారిమఠం విచ్చేశారు. బి.మఠం ఐదు రోడ్లు కూడలిలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ విభాగాల నాయకులు, కార్యకర్తలు ఆయన ఘన స్వాగతం పలికి సత్కరించారు. మఠం పిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం ప్రసాదం అందించారు. బొగ్గల సుబ్బిరెడ్డి, నేలటూరు వెంకటరామిరెడ్డి, మన్యం శంకర్‌రెడ్డి, ఎల్లటూరి శివారెడ్డి, యత్తపు సుబ్బారెడ్డి, మనోహరాచారి, గొడ్లవీడు నాగేశ్వర్‌రెడ్డి, పెద్దిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి,జౌకుపల్లె దుగ్గిరెడ్డి, కేశాపురం రామగుర్విరెడ్డి, రాజుపేట మస్తాన్, అమీర్‌బాషా, రామోహన్‌రెడ్డి, ఎల్లటూరి ఈశ్వర్‌రెడ్డి, సుబ్బరాజ, రాజానాయుడు, వెంకటయ్య, రామయ్య, వీరా, సుబ్బరామిరెడ్డి, కృష్ణారెడ్డి, రమేష్ రెడ్డి, సిద్దారెడ్డి, అనంతరెడ్డి, జోగయ్య, సుబ్రమణ్యం స్వామి, శ్యాంప్రసాద్‌రెడ్డి, బాబు, జోగయ్య, రమణారెడ్డి, నాగార్జుననాయడు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్లు పంపిణీ

అట్లూరు : వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఎం.నాగరాజ పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో తిప్పనపల్లి, వీరబల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులైన రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టరు గొర్రు తదితర పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి ఇంత వరకు యాంత్రీకరణ పథకం ద్వారా రైతులకు 50 శాతం సబ్సిడీతో 25 మందికి ట్రాక్టర్ ఆధారిత పనిముట్లను అందజేయడం జరిగిందన్నారు. ఆసక్తిగల రైతులు ఆన్‌లైన్ ద్వారా అవసరమైన పరికరాలకు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలన్నారు.

విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకోవాలి

ప్రొద్దుటూరు: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. స్థానిక వేంకటేశ్వర డిగ్రీ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా రాయల్ కౌంటీ రిసార్ట్స్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం విద్యార్థులకు అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సంపద సృష్టి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ఏర్పాటు చేశాయని తెలిపారు. పీఎంఈజీవై ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 50 శాతం వరకు సబ్సిడీ ఇస్తోందన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులు 70 శాతం ప్లేస్‌మెంట్స్ సాధించడం గొప్ప విషయం అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్ అరకటవేముల హరినారాయణ మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా ఎంతో కష్టపడి కళాశాలను అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, వంగలి శశిభూషణ్ రెడ్డి, జంగిలి వెంకటసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, గౌరీశంకర్, పృథ్వీనారాయణ, పాల్గొన్నారు.

బోర్డు ఆదేశాల ప్రకారం తరగతులు నిర్వహించాలి

ప్రొద్దుటూరు : ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల ప్రకారం జిల్లాలోని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ కాలేజీలు తరగతులు నిర్వహించాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు ఓ ప్రకటనలో కోరారు. బోర్డు ఆదేశాల మేరకు ఏప్రిల్ 1వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం అన్ని గ్రూపుల వారికి తరగతులు నిర్వహించాల్సి ఉందన్నారు. కొన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీల యాజమాన్యం లెక్చరర్లకు జీతాలు ఇవ్వాల్సి వస్తుందని సైన్స్ గ్రూపులకే తరగతులు నిర్వహించే పథకాలు రచిస్తున్నాయని తెలిపారు.

తాగునీరు అందించడమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. బద్వేలు మున్సిపాలిటీకి తాగు నీరు అందించే బి.మఠం మండలం బ్రహ్మంసాగర్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా సిబ్బందితో ప్లాంట్‌ను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు బాధ్యతగా నీటిని వృథా చేయకుండా చూసుకోవాలని కోరారు. వార్డుల్లో తిరుగుతూ కొళాయిల దగ్గర, పైపులైను జాయింట్ల దగ్గర లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఈ సుమన్‌రెడ్డి, సతీష్, మహేష్ పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌కు వినతుల వెల్లువ



మంత్రి సత్యకుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు రూరల్ : ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు సమ న్యాయం చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు బుధవారం ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ కోరారు. కానపల్లెలో మంత్రిని కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. దండు వీరయ్య మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో రాష్ట్రాన్ని యూనిట్ తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లయ్యమాదిగ, నాగభూషణం మాదిగ, సాకె బాలలక్ష్మయ్య మాదిగ, వెంకటనారాయణ, పి.శివరామ్ మాదిగ, కె.సహదేవుడు వెంకటలక్ష్మి, బాలనరసింహులు, బాలయ్య, రామాంజనేయులు, చాపాటి చెన్నయ్య పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు క్రైం : ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు పట్టణంలోని పలువురు వినతిపత్రాలు అందజేశారు. ప్రొద్దుటూరు పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం మంత్రి స్వరూప్ కంటి ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన సమావేశంలో పట్టణ ప్రముఖులు, ఉద్యోగులు మంత్రిని కలిసి వినతిపత్రాలు అందచేసి వాటిని పరిష్కరించాలని కోరారు. ఏపీ గవర్నమెంట్ హాస్పిటల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, జిల్లా హాస్పిటల్‌లోని శానిటరీ వర్కర్లు మంత్రిని కలిసి వినతి పత్రం అందచేశారు. ప్రస్తుతం తమకు రూ.12,400 జీతం ఇస్తున్నారని, జీఓ నంబర్ 549 ప్రకారం రూ.16 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఆస్పత్రిలో శాశ్వతమైన మంచినీటి వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని మన ప్రజాసేవా సమితి అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్ మంత్రికి వినతిపత్రం అందచేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57కు అనుగుణంగా 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయులు మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం మంత్రి స్వరూప్ హాస్పిటల్‌లో డాక్టర్ స్వరూప్‌కుమార్‌రెడ్డితో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సంస్కృతి సేవా సంస్థ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ కృషి వెలకట్టలేనిది

ప్రొద్దుటూరు రూరల్ : ఎస్సీ వర్గీకరణకోసం మూడు దశాబ్దాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చేసిన కృషి వెలకట్టలేనిదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. స్థానిక మండీ బజార్‌లోని ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో మంత్రి సత్యకుమార్‌కు వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ గురిజాల రామమోహన్‌రెడ్డి బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. మంత్రి మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ వికలాంగుల హక్కుల కోసం, బుడగ, బేడ జంగాలను ఎస్సీ ఉపకులాలలో చేర్చడంలో ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం గురజాల రామమోహన్ రెడ్డి, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు, బేడ, బుడగ జంగం సంఘం నాయకులు శాలువా, పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, శివ, ఎంఎస్ఎఫ్ నాయకులు, కత్తి ఓబులేసు, జగన్, బయన్న పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి



తహసీల్దారుకు అర్జీలు సమర్పిస్తున్న సీపీఐ నాయకులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్లు లేని నిరుపేదలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలంతో పాటు వ్యవసాయ భూమిని ఇచ్చి హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, రూరల్ కార్యదర్శి ఇమ్మానుయేల్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అర్హులైన లబ్ధిదారులతో కలిసి నిరసన చేపట్టి అనంతరం తహసీల్దారుకు ఇంటి స్థలాల దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలని కోరారు. చెన్నంపల్లె గ్రామ పొలం సర్వే నెంబర్ 1566లో గత సంవత్సర కాలంగా నివాస గృహాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న నిరుపేదలకు అదే ప్రాంతంలో పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే రోడ్లు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ, గోపవరం మండల కార్యదర్శి పెంచలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుబ్బారెడ్డి, మహిళా సంఘం నాయకురాలు కృపాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలపై ధర్నా



ధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మికులు

పోరుమామిళ్ల : విద్యుత్ కార్మికుల సమస్యలపై ఈనెల 7న తిరుపతిలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ ఎలక్ట్రికల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక డీఈఈ కార్యాలయం ఎదుట యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సభ్యుల ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జెన్‌కోలో పని చేస్తున్న 23,500 మంది కార్మికులకు 2022 నుంచి ఇంతవరకు అరియర్స్ ఇవ్వలేదన్నారు. కొత్త ఆపరేటర్లకు 2019 నుంచి 2024 వరకు చేరిన ప్రతి ఒక్కరికి పాత ఆపరేటర్‌తో సమానంగా జీతాలు ఇవ్వాలన్నారు. ఐటీఐ అర్హత ఉన్న ఉన్న వాచ్‌మెన్‌లకు స్కిల్ వేతనం అమలు చేయాలని, ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌ను నియమించాలన్నారు. డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 7న తిరుపతిలో జరిగే ధర్నాలో జిల్లాలోని విద్యుత్ కార్మికులందరూ పాల్గొనాలని ఆయన పిలుపిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు భైరవప్రసాద్, యూనియన్ మైదుకూరు డివిజన్ కార్యదర్శి కొండయ్య, జిల్లా నాయకులు నౌషద్, గిరి బ్రహ్మం, బాలాజీ, గోపి, రంగస్వామి, ఆదిలక్ష్మి, చెన్నారెడ్డి, బాలరాజు, అంకిరెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

మైదుకూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ డిపోలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపు తున్నందుకు నిరసనగా మైదుకూరు ఆర్టీసీ డిపోలో బుధవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఎన్నో దఫాలుగా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులపై పనిభారం మోపుతూ ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. అక్రమ సస్పెన్షన్లను, రిమూవల్స్, ఛార్జ్ సీట్లు, ఇంక్రిమెంట్లలో కోత నుంచి ఉద్యోగులను విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్యారేజీల్లో తగినంత సిబ్బందిని నియమించాలన్నారు. ఈహెచ్ఎస్ స్థానంలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వీఎస్ రాయుడు, ఎస్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా విద్యను బోధించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాణిరజిత మాధురి

చాపాడు : అధ్యాపకులు తమలోని నైపుణ్యాన్ని పెంపొందించుకొనేలా విద్యార్థులకు టెక్నాలజీకి అనుగుణంగా విద్యను బోధించాలని హైదరాబాదుకు చెందిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఇంగ్లీషు ప్రొఫెసర్ కె.రాణిరజిత మాధురి తెలిపారు. స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ) కాలేజీలో బుధవారం ఎంబీఏ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి బుధవారం హాజరైన యూనివర్శిటీ ప్రొఫెసర్ మాట్లాడుతూ రోజు రోజుకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యా బోధన చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతికను ఉపయోగించి విద్యార్థులు మానసిక వత్తిడికి గురికాకుండా విద్యా బోధన కొనసాగించాలన్నారు. ప్రతి రోజూ విద్యార్థుల ప్రవర్తన తీరు పట్ల అవగాహన కల్పించుకోవాలని, వెనకబడిన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని వారికి చదువు మీద ఆసక్తి కలిగేలా అవగాహన కల్పించాలన్నారు. ఇదే క్రమంలో లింగ బేధం లేకుండా ప్రతి ఒక్క విద్యార్థిలో నాయకత్వ లక్షణాలు ఉండేలా చైతన్య పరచాలన్నారు. అధ్యాపకుల బోధన వల్లనే విద్యార్థులు వారి ప్రవర్తన, తీరులో మార్పులు వస్తాయన్నారు. అధ్యాకులు, విద్యార్థులు ఏకాగ్రత విధానం వ్యహరించడం వలన అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని, లక్ష్యంతోనే ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీబీఐటీ డైరెక్టర్ అడ్మిన్ జి.శ్రీనివాసులరెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్.శృతి తదితరులు పాల్గొన్నారు.